క్లుప్తంగా

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతు నాయకులు

మార్టూరు: రైతులు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కౌలు రైతు సంఘం నాయకుడు కందిమళ్ల రామకోటేశ్వరరావు కోరారు. సోమవారం మండలంలోని కోలలపూడి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన తహసీల్దార్ టీ.ప్రశాంతితో స్థానిక సమస్యల గురించి మాట్లాడారు. గ్రామ సర్వేనంబర్ 208లో 20 సెంట్ల భూమి స్థానిక శివాలయానికి చెందినది కాగా ఆ నంబర్‌తో పాటు చుట్టుపక్కల నంబర్లలోని ప్రైవేట్ భూములు కూడా దేవదాయ శాఖకు చెందినవిగా రికార్డులలో నమోదైనట్లు తెలిపారు. దీనివలన సంబంధిత రైతులు తమ భూముల క్రయవిక్రయాలు జరుపుకోవాలన్నా ఆన్‌లైన్ చేసుకోవాలన్నా సమస్యగా మారిందని, దేవాలయానికి చెందిన 20 సెంట్లు భూమిని ఆ సర్వే నంబర్ నుంచి విడగొట్టి సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. సదస్సులో దేవదాయ శాఖ ఈవో శిరీష, సర్పంచ్ ఎం సతీష్ కుమార్, సర్వేయర్ ఏడుకొండలు, వీఆర్వో వీరయ్య, కృష్ణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 21 మందికి ఉద్యోగాలు



జాబ్ మేళాకు హాజరైన అభ్యర్థులు, ప్రతినిధులు

మార్టూరు: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మార్టూరులో నిర్వహించిన జాబ్ మేళాలో 21 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఐసీఐసీఐ బ్యాంక్, ముత్తూట్ ఫైనాన్స్, టాటా క్యాపిటల్ సంస్థ ప్రతినిధులు హాజరైన జాబ్ మేళాకు మొత్తం 44 మంది అభ్యర్థులు హాజరు కాగా వారిలో 21 మందిని ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. మార్టూరు హర్షిణి కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమంలో జిల్లా ప్లేస్మెంట్ అధికారి శ్రీనివాస్, కోఆర్డినేటర్ శ్రీకాంత్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ గోపీనాథ్, కళాశాల సిబ్బంది అభ్యర్థులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు



షాపుల యజమానులకు సూచనలు చేస్తున్న ఎస్సై

చీరాల: వైన్ షాపుల యజమానులు, మేనేజర్లు అందరూ నిబంధనలు పాటించాలని ఎస్సై చంద్రశేఖర్ సూచించారు. సోమవారం రాత్రి ఈపూరుపాలెం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వైన్ షాపులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయంలో నిర్ణీత సమయంలోపు మాత్రమే మద్యం విక్రయాలు సాగించాలని, సమయం దాటి అమ్మకాలు చేపడితే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. వైన్ షాపులలో పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేస్తే సహించేది లేదని ఆయన సూచించారు.

రామాలయాల్లో ధనుర్మాస పూజలు



ప్రత్యేక అలంకరణలో సీతా, రామ, లక్ష్మణ విగ్రహాలు

బల్లికురవ: ధనుర్మాసం సందర్భంగా మండలంలోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు చేపడుతున్నారు. కొండాయపాలెం, చెన్నుపల్లి, కొప్పరపాలెం, కొత్తమల్లాయపాలెం, కొణిదెన, కొత్తూరు, కూకట్లపల్లి, వెలమవారిపాలెం, వైదన, కొమ్మినేని వారిపాలెం గ్రామాల్లోని రామాలయాల్లో హనుమత్ లక్ష్మణ సీతా సమేత కోదండరామునికి తెల్లవారుజామున 5 గంటలనుంచే విశిష్టపూజలు, ప్రత్యేక అలంకరణ చేపడుతున్నారు. ధనుర్మాసం వేడుకలు సంక్రాంతి పండగ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు ధర్మకర్తలు తెలిపారు. గత నెల 17న ప్రారంభమైన ఈ వేడుకలతో రామాలయాలకు భక్తులు పోటెత్తుతున్నారు. ముగింపులో భాగంగా గోదాదేవి కల్యాణం నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

రోడ్డు మార్జిన్లు అద్దెకిస్తాం..

- డ్రైనేజీ కాల్వలపై కట్టడాలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రజలు
- తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు

వేటపాలెం:

అత్తసొమ్ము అల్లుడు దానం చేసిన సామెతలా తయారైంది రోడ్డు పక్కన ఇంటి యజమానులు వ్యవహారం. గ్రామ పంచాయతీ రోడ్డు పక్కన మార్జిన్లు ప్రభుత్వ స్థలాలను బడ్డీ కొట్లు ఇతర వ్యాపార సంస్థలకు అద్దెకిచ్చుకొంటున్నారు. ప్రతి నెల వేలల్లో అద్దె వసూలు చేసుకుంటున్నారు. ఈ వ్యవహారం యథేచ్ఛగా గ్రామ నడిబొడ్డున గ్రామ పంచాయతీ రోడ్డులో మార్జిన్‌లను ఆక్రమంచి అద్దెకు ఇస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యహరిస్తున్నారు. దాదాపు ఐదేళ్లగా గ్రామ పంచాయతీకి ఎన్నికలు జరగక పోవడంతో పంచాయతీ అధికారులే వీటికి ప్రత్యేక అధికారులుగా వ్యవహరిస్తూ ప్రజల వద్ద అందిన కాడికి దండుకుంటున్నారు. తమను అడిగే వాళ్లు ఎవరూ లేరనే ధైర్యంతో ఆక్రమణదారులు బరితెగిస్తున్నారు.



పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద డ్రైనేజీపై దుకాణం

రోడ్డు ఇరువైపులా నిర్మాణాలు..

వన్‌వే రోడ్డు నుంచి రైల్వే స్టేషన్ దగ్గర దాకా గల డ్రైనేజీ కాలవను ఆక్రమణదారులు, దుకాణదారులు ఆక్రమించి పూడ్చివేసి దానిపై కట్టడాలు, దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. వన్‌వే రోడ్డు దగ్గర నుంచి రైల్వే స్టేషన్ రోడ్డు వరకు గల సిమెంట్ రోడ్డు కిరువైపుల గల మార్జిన్లను నివాస గృహ యజమానులు ఆక్రమించి అద్దెకి ఇచ్చారు. ఈ మార్జిన్ స్థలాల్లో వివిధ వ్యాపారాలు నెలకొల్పుకొని వ్యాపారాలు నిర్వహించుకుంటున్నారు. ఈ వ్యవహారం అంతా తెలిసి కూడా అధికారులు మిన్నకుండిపోయారు. దాదాపు వన్‌వేరోడ్డు నుంచి రైల్వే స్టేషన్ వరకు రోడ్డు మార్జిన్ ఆక్రమించి 30 వరకు దుకాణాలు ఏర్పాటు శారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు దీనిపై పరిశీలించి రోడ్డు మార్జిన్ స్థలాలు ఆక్రమించి అద్దెకిచ్చిన వారిపై చర్యలు తీసుకొని ఆక్రమణలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



రైల్వే స్టేషన్ రోడ్డులో పోలీస్ స్టేషన్ పక్కనే రోడ్డు మార్జిన్‌లో దుకాణాలు

డ్రైనేజీలపై పక్కా కట్టడాలు..

వేటపాలెం రైల్వే స్టేషన్ వద్ద నుంచి పొట్టిసుబ్బయ్యపాలెం వరకు గల రోడ్డును డబుల్ లైన్ రోడ్డుగా విస్తరించారు. ఈ రోడ్డును రైల్వే స్టేషన్ నుంచి సెంటర్ వరకు గల ఆక్రమణలను తొలగించి ఆధునీకీకరించారు. సెంటర్ నుంచి రైల్వేస్టేషన్ వరకు గల రోడ్డులో ఆక్రమణలు తొలగించి ఐదేళ్ల కిందట డబుల్ సిమెంట్ రోడ్డు వేశారు. ఈ రోడ్డు కిరువైపులా గ్రామ పంచాయతీ అధికారులు లక్షలు నిధుల పెట్టి మురుగునీటి డ్రైనేజీ కాలువ ఏర్పాటు చేశారు. అయితే మురుగు నీటి కాలవను ఆక్రమించి పక్కా భవనాలు, దుకాణాలు ఏర్పాటు చేశారు. కాని వీటిపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది.



రైల్వే స్టేషన్ రోడ్డులో డ్రైనేజీపై నిర్మించిన పక్కా భవనం

ఆక్రమణలతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది..

వన్‌వే రోడ్డు నుంచి రైల్వే స్టేషన్ వరకు రోడ్డు మార్జిన్‌లు ఫుట్‌పాత్‌లు, ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేశారు. దీనితో సాయంకాలం అయ్యే సరికి వాహనాలు రద్దీతో ప్రజలకు రాకపోకలకు ఇబ్బంది కరంగా ఉంది. ఈ మార్గంలోనే పోలీస్ స్టేషన్, రైల్వే స్టేషన్, పాఠశాల, గ్రామ పంచాయతీ కార్యాలయం, కళాశాలకు రాకపోకలు నిత్యం జరుగుతుంటాయి. అయితే రోడ్డు మార్జిన్‌లు డ్రైనేజీ కాలవలు అక్రమించడం వల్ల ఇబ్బందులు పడుతున్నాం. మార్జిన్‌ల ఆక్రమణాలు తొలగించాలి.

– రామచంద్రరావు, వేటపాలెం

విద్యార్థుల హాజరు శాతం పెంచుకోవాలి



పాఠశాల రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ ఈఓ శ్రీనివాసరావు

యద్రంవారిపాలెం (కారంచేడు): ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతులు కల్పించుకోవడంతో పాటు, వాటి అభివృద్ధికి ఉపాధ్యాయులు, కమిటీలు, తల్లిదండ్రులు కృషిచేయాలని పర్చూరు డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి ఏ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆయన మండలంలోని యద్రంవారిపాలెం, ఆదిపూడి ఉన్నత పాఠశాలలను వార్షిక తనిఖీల్లో భాగంగా పరిశీలించారు. వైపీపాలెంలో ఉన్నత పాఠశాలకు సంబంధించిన అన్ని రకాల రికార్డులను ఆయన పరిశీలించారు. పాఠశాల విద్యార్థుల నమోదుతో పాటు, ప్రస్తుతం హాజరు శాతం మరింత పెంచుకొనేలా కృషిచేయాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శేఖర్‌బాబు, ఉపాధ్యాయులు, కుకింగ్ నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యూనియన్ నాయకుడికి సత్కారం

అద్దంకి: బాపట్ల జిల్లా గజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ సెక్రరీ డాక్టర్ వీ ప్రసాద్ ఎన్నికయ్యారు. ఆయన స్థానిక కట్టారామ కోటేశ్వరరావు డిగ్రీ అండ్‌పీజీ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తుండటంతో, తమ కళాశాల అధ్యాపకుడికి దక్కిన హోదాపై సంతోషం వ్యక్తం చేస్తూ సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ వీ మోహనరావు, అధ్యాపకులు ఆయనను ఘనంగా సన్మానించారు.



సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ మోహనరావు

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



రెవెన్యూ ఉద్యోగులు, సర్వేయర్లకు సూచనలందిస్తున్న ఆర్డీవో తూమాటి చంద్రశేఖర నాయుడు

చీరాల టౌన్: రెవెన్యూ ఉద్యోగులు విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని చీరాల ఆర్డీవో తూమాటి చంద్రశేఖర నాయుడు హెచ్చరించారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో చీరాల మండలంలోని వీఆర్వోలు, సచివాలయాల సర్వేయర్లు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ కుర్రా గోపీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశానికి హాజరైన ఆర్డీవో మాట్లాడుతూ.. కొందరు రెవెన్యూ సిబ్బంది, సచివాలయాల సర్వేయర్లు గ్రామాల్లో జరుగుతున్న అక్రమాలను ఉన్నతాధికారులకు సమాచారం అందించకపోవడం వలన కొందరు ఉద్యోగులు సస్పెండ్ అయ్యారన్నారు. విధుల్లో అలసత్వం వహించిన, ఉన్నతాధికారుల ఆదేశాల పాటించకపోయిన ఉద్యోగులపై చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఇసుక తరలింపుపై అప్రమత్తంగా ఉండాలని అక్రమంగా క్వారీల ద్వారా ఇసుక రవాణా చేస్తే ఉపేక్షించవద్దన్నారు. అలానే అనధికార లే అవుట్లు విరివిగా వేస్తున్నారని అలాంటి లే అవుట్లను గుర్తించి సమాచారాన్ని వెంటనే ఉన్నతాధికారులకు సమాచారాన్ని అందించాలన్నారు. తీరప్రాంత గ్రామాలు, శివారు ప్రాంతాలు, పట్టణ ప్రాంతాల్లోని వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సమస్యలను త్వరగా పరిష్కారం చేయాలన్నారు. వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు, అర్జీలను విచారించకుండా వీఆర్వోలు తమవద్దే ఉంచుకోవడం వలన పెండింగ్ అర్జీలు పెరుగుతాయని విధులను త్వరగా పూర్తి చేయాలన్నారు. అర్జీదారుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని, అసమర్థంగా విధులు నిర్వహించడం, అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ దేవతోటి అర్జున్, ఎన్నికల డీటీ సుశీల, మండల సర్వేయర్ చెరుకూరి బ్రాహ్మణయ్య, వీఆర్వోలు, సచివాలయాల సర్వేయర్లు ఉన్నారు.

వాటర్ ఫౌంటెన్‌కు మరమ్మతులు చేయాలి



రైల్వే స్టేషన్ ఎదురుగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ కాంస్య విగ్రహం



కళా విహీనంగా ఉన్న వాటర్ ఫౌంటెన్

చీరాల రూరల్: స్థానిక రైల్వే స్టేషన్ వద్దగల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ముందు ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెన్‌లు మరమ్మతులకు గురయ్యాయి. ఇటీవల కాలంలో పాత అంబేడ్కర్ విగ్రహం తొలగించిన మున్సిపల్ అధికారులు రూ. 30 లక్షలకుపై గా వెచ్చించి కాంస్య విగ్రహం ఏర్పాటు చేశారు. విగ్రహానికి ముందు వెనుక రెండు నీటి ఫౌంటేన్‌లు ఏర్పాటుచేసి లైటింగ్‌తో పాటు గ్రీనరీ అమర్చారు. అయితే అధికారులు పర్యవేక్షణ కొరవడడంతో నెల రోజులుగా నీటి ఫౌంటెన్‌లు మరమ్మతులకు గురయ్యాయి. విగ్రహం కింద చెత్త చెదారాలు కూడా వేస్తున్నారు. ఈసమస్యలను మున్సిపల్ అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడడంలేదని దళిత, ప్రజా సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఏఈ రవికుమార్‌ను వివరణ కోరగా మరమ్మతులకు గురైన వాటర్ ఫౌంటెన్‌లు రెండు రోజుల్లో సరి చేయిస్తామని చెప్పారు.

కూలీలందరికీ ఉపాధి పనులు

చీరాల టౌన్: వలసలను నిర్మూలించి కూలీలు అందరికి ఉపాధి కల్పిస్తామని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో దాసు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని తోటవారిపాలెం, పిట్టువారిపాలెం గ్రామ పంచాయతీలో సచివాలయాల అడ్మిన్లు, డిజిటల్ అసిస్టెంట్లతో కలిసి ఉపాది పనుల సంఖ్య పెంపుదలపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీవో మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల్లో కూలి పనులకు వెళ్లే ప్రతి ఒక్కరికి ఉపాధిని అందించేందుకు రూపొందించిన ఉపాధిహామీ పథకంలో పనులు ఎక్కువగా గుర్తించి పనులు కల్పించాలన్నారు. గ్రామాల నుంచి ఎవరూ ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా చర్యలు తీసుకుని ప్రతి కూలీకి జాబ్‌కార్డు అందించి ఉపాధి పనులకు వచ్చేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో కలిసి అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు అవసరమైన ప్రతి పనిని రికార్డు చేసి పనుల సంఖ్యలు పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో పంచాయితీ కార్యదర్శులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఫీల్డు అసిస్టెంట్లు, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



నిత్యావసర సరుకులు అందజేస్తున్న అధికారులు

పర్చూరు (చినగంజాం): గ్రామంలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులను పర్చూరు తహసిల్దార్ పి. బ్రహ్మయ్య పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు, వంట సామగ్రి, నగదును అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ సుధారాణి, ఆర్‌ఐ ప్రేమ్‌కుమార్, వీఆర్వోలు శ్రీనివాసరావు, గోవిందరెడ్డి స్థానిక టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రిక ఆవిష్కరణ



ఆహ్వానపత్రిక ఆవిష్కరిస్తున్న ఆలయ సభ్యులు

చీరాల అర్బన్: పట్టణంలోని పేరాలలో వేంచేసియున్న భద్రావతి సమేత భావనారుషి స్వామివారి శత వసంత బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికను సోమవారం దేవాలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేవస్థాన గౌరవాధ్యక్షుడు, మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు హాజరై ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాలు వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 12వ తేదీ నుంచి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 17న రథోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఉడతా భాస్కరపార్వతీశ్వర రావు, ప్రధాన కార్యదర్శి జి.వెంకటసుబ్బారావు, కౌన్సిలర్ జి.జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ ధ్రువీకరణ జాబితాలో లోపాలపై విచారణ



విచారణ చేస్తున్న అధికారులు

సంతమాగులూరు (అద్దంకి రూరల్): ఎస్సీ వర్గీకరణ అంతా గందరగోళంగా ఉంది. హిందువులకు క్రిస్టియన్లు అని నమోదయ్యాయి. కొందరి పేర్లు అసలే లేవు. దీంతో ఆయా గ్రామాల్లో జాబితాలో తప్పులుగా నమోదైనందున అధికారులు విచారణ చేపట్టారు. సంతమాగులూరు మండలంలోని పాతమాగులూరులో ఎస్సీ ధ్రువీకరణ జాబితా తయారులో చోటుచేసుకున్న లోపాలపై సోమవారం సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ విచారణ చేపట్టారు. జరిగిన లోపాలను కాలనీ వాసులు వినతి పత్రాన్ని అందజేశారు.

రోటరీ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ



టెస్ట్ పేపర్లను పంపిణీ చేస్తున్న రోటరీ సభ్యులు

అద్దంకి: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ అద్దంకి ఆధ్వర్యంలో సోమవారం గిరిజన గురుకుల పాఠశాలలో మోడల్ టెస్ట్ పేపర్లు పంపిణీ చేశారు. ఈపేపర్లను రోటరీ ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు సౌజన్యంతో అందజేశారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ, విద్యార్థులు బాగా కష్టపడి చదివి లక్ష్యం సాధించాలని పేర్కొన్నారు. బాబురావు మాట్లాడుతూ, హాస్టల్ విద్యార్థులు ఒకరికొకరు పరస్పర సహకారం, స్నేహభావంతో మెలగాలని పేర్కొన్నారు. రోటరీ సంస్థ గతంలో కూడా తమ పాఠశాలకు సహాయం చేశారని, ఇపుడు మోడల్ పేపర్ బుక్స్ ఇచ్చినందుకు ప్రిన్సిపాల్ పురుషోత్తం రోటరీ వారికి కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు, షేక్ మహమ్మద్ రఫీ, సందిరెడ్డి శ్రీనివాసరావు, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, తాళ్లూరి బాబురావు, ప్రిన్సిపాల్ పురుషోత్తం, ఉపాధ్యాయులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరికి రిమాండ్

చీరాల: హత్యాయత్నం కేసులో ఇద్దరిని అరెస్టు కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఈపూరుపాలెం రూరల్ ఎస్సై చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. ఈపూరుపాలెం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 3న జరిగిన హత్యాయత్నం కేసులో చీరాల ఆదినారాయణపురానికి చెందిన బి.రజిత, చీరాల రామ్‌నగర్‌కు చెందిన అంగడి సుధీర్ అనే ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో పరచగా న్యాయమూర్తి ఇద్దరికి రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

మధుసూదనరెడ్డిని కలిసిన చినగంజాం నాయకులు



మధుసూదనరెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చినగంజాం: వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజక వర్గ సమన్వయకర్త గాదె మధుసూదనరెడ్డిని చిన గంజాం మండలానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు దుశ్శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని పార్టీ పరిస్థితులు, నాయకులు, కార్యకర్తల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయనను కలిసిన వారిలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి, రాజు బంగారుపాలెం మాజీ సర్పంచ్ కుక్కల బురకాయలరెడ్డి, మరపాల అర్జున్‌రెడ్డి, మారుబోయిన హేమంత్‌కుమార్ రెడ్డి, నిడుబ్రోలు సాయి తదితరులు ఉన్నారు.

జీవితాల్లో వెలుగులు నింపేది చదువే



స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్న ఎంపీడీఓ నేతాజీ

కారంచేడు: ఇంట్లో ప్రతి ఒక్కరూ చక్కగా చదువుకొని ఉండటం వలన వారి జీవితాలకు మంచి వెలుగులు నింపుతుందని ఎంపీడీఓ కే నేతాజీ అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రం కారంచేడు వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వయోజనుల విద్య వలంటీర్లుగా ఉన్నవారికి పాఠ్యపుస్తకాలు, మెటీయల్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గ్రామాల్లో ఎంతో మంది వయోజనులు కనీసం చదవడం, రాయడం, సంతకం కూడా చేయడం రాని వారు ఉన్నారని చెప్పారు. అలాంటి వారిని గుర్తించి వారికి కనీసం చదవడం, రాయడం, వేలిముద్రలు కాకుండా సంతకం, పేర్లు రాయడం నేర్చుకొనేలా తీర్చిదిద్దాలన్నారు. గ్రామాల్లో నిరక్షరాస్యతను నిర్మూలించేలా వలంటీర్లు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎంవీ సత్యనారాయణ, మండల కోఆర్డినేటర్ మనోరంజన్, వీఓఏలు, వలంటీర్లు పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతతో ఆరోగ్యం

బల్లికురవ: ప్రతి ఒక్కరు చేతులను తరచూ సబ్బుతో శుభ్రం చేసుకోవాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ రమీజ్ అహమ్మద్ తెలిపారు. హెచ్‌ఎంపీవీ వైరస్ వల్ల జ్వరం, దగ్గు, జలుబు, గొంతు నొప్పివంటివి ఉంటాయన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మాస్క్ ధరించాలని వైరస్ బారిన పడితే తక్షణమే వైద్యం చేయించుకోవాలని వైద్యాధికారి కోరారు. చేతుల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు.